క్లుప్తంగా

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

చిగురుమామిడి: విద్యార్థులు, యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చిగురుమామిడి ఎస్సై దాస సుధాకర్ కోరారు. బుధవారం చిగురుమామిడి జెడ్పీపాఠశాలలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు, ఫ్రెండ్లీపోలీసింగ్‌తో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన లేక చాలామంది బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు కోల్పోతున్నారన్నారు. ఆన్‌లైన్ యాప్స్, అప్లికేషన్స్‌పై అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్: పట్టణంలోని 26వ వార్డులో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక ప్రారంభించి మాట్లాడారు. కంటివెలుగు వైద్యశిబిరాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యాధికారి మహోన్నత పటేల్, కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్‌పర్సన్ నిర్మల, కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత



రిబ్బన్ కట్‌చేస్తున్న జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి

గన్నేరువరం: విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఇందులో భాగంగా ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తోందని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని హన్మజిపల్లె ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మనబడి కార్యక్రమంలో తాగునీటి ట్యాంకు నిర్మాణం, విద్యుత్ మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. వీటిని బుధవారం జెడ్పీటీసీ ప్రారంభించారు. ఇన్‌చార్జ్ విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లింగాల రజిత, హెచ్‌ఎం సుమలత, భాగ్యలక్ష్మి, నాయకులు లింగాల మహేందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయం సందర్శన



గ్రంథాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు, ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ఇంగ్లిష్ టీచర్ పీడీ సూజాత, డాక్టర్ సువర్ణ, తెలుగుటీచర్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా విద్యార్థులకు దోహదపడతాయని, పుస్తక పఠనం మంచి నేస్తామన్నారు. విజ్ఞానవంతులైన ప్రముఖులు, పుస్తకపఠనం, రచనలు చదువుతుండేవారని వారిని ఆదర్శంగా తీసుకొని, విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు లక్ష్మి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

'24 గంటల కరెంటు ఎక్కడ ఇస్తున్నారు'

చిగురుమామిడి: రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వం ఎక్కడ ఇస్తుందో చెప్పాలని బీజేపీ సీనియర్ నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి కోరారు. బుధవారం చిగురుమామిడిలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉదయం వేళల్లో కనీసం ఆరు నుంచి ఏడు గంటలు కూడా కరెంట్ ఇవ్వడం లేదన్నారు. సీఎం కేసీఆర్ ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్‌ను విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అడిగేందుకు వచ్చిన ఏబీవీపీ కార్యకర్తలను దూషించి అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు దుడ్డేల లక్ష్మినారాయణ, ప్రధానకార్యదర్శులు పొలోజు సంతోష్‌కుమార్, పైడిపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మహేందర్, జిల్లా నాయకులు వంగర మల్లేశం, నాయకులు రాజేందర్, హరీశ్, శేఖర్, రమేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్డు పనులు పూర్తయ్యేదెప్పుడో?

- రోడ్డుపై తేలుతున్న కంకర
- తరుచూ ప్రమాదాలు
- వాహనదారుల తంటాలు



కంకర తేలిన రోడ్డు

గంగాధర: తారు రోడ్డుకు నిధులు మంజూరై పనులు ప్రారంభించి ఏడాది గడుస్తున్నా నిర్మాణంలో జాప్యంతో రోడ్డుపై కంకర తేలి వాహనదారులు, రైతులు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కురిక్యాల–గర్శకుర్తి ప్రధాన రహదారిలో ఉప్పరమల్యాల గ్రామ శివారు నుంచి హిమ్మత్‌నగర్ గుండా రామడుగు మండలంలోని వెదిర గ్రామంలోని కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి వరకు 6.65 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో రూ.3.70 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు పనులకు 2021లో టెండర్లు నిర్వహించగా కాంట్రాక్టర్ 2021 జులై 28న పనులు ప్రారంభించి ఏడాది గడిచినా పనులు పూర్తికావడం లేదు. రామడుగు మండలంలోని వెదిర, గంగాధర మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామాల పరిధిలో సీసీ రోడ్లు, మురుగు కాలువ పనులు పూర్తిచేశాడు. మిగిలిన రోడ్డుపై తారు వేసేందుకు దొడ్డు, సన్న కంకర పోసి రోలింగ్ చేసి వదిలేశారు. ఈక్రమంలో కొన్నినెలలుగా కంకర రోడ్డుపై వాహనాల రాకపోకలు సాగిస్తుండడంతో కంకర తేలి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నెలరోజుల్లో మూడు కార్లు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలున్నాయి. రోడ్డుపై తేలిన కంకరను తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై పొలాలకు వెళ్లే రైతులు కంకర రోడ్డుపై నడిచేందుకు తంటాలు పడుతున్నారు. నడుచుకుంటూ వెళ్తున్నక్రమంలో పక్క నుంచి వాహనాలు వెళ్తుండగా రాళ్లు వచ్చి మీద పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తారురోడ్డు పనులు ప్రారంభించి పూర్తిచేయాలని వెదిర, హిమ్మత్‌నగర్, రంగరావుపల్లి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నడిచేందుకు ఇబ్బంది



కంకర తేలిన హిమ్మత్‌నగర్ రోడ్డుపై నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రతీ రోజు ఈ రోడ్డువెంట పంటపొలాల వెళ్తుండగా చిన్నచిన్న కంకర రాళ్లు రోడ్డుపై తేలిఉండడంతో నడిచే వీలులేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రోడ్డుపనులు పూర్తిస్థాయిలో జరిగేలా చూడాలి.

– మధుకర్‌రెడ్డి, రైతు, వెదిర

మొత్తం కంకరే



వెదిర గ్రామ శివారు నుంచి హిమ్మత్‌నగర్ గ్రామం వరకు రోడ్డుపై మొత్తం కంకర తేలింది. మొదట్లో పెద్దపెద్ద రాళ్లు పక్కకు పోయి ఇప్పుడు చిన్నచిన్న కంకర రాళ్లు తేలడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ రోడ్డు పొంట వెళ్లాలంటేనే భయంగా ఉంది.

– లాలయ్య, హిమ్మత్‌నగర్

పనులు పూర్తిచేయాలి



రంగరావుపల్లి గ్రామం నుంచి రామడుగు మండలంలోని వెదిర వరకు నిర్మిస్తున్న తారు రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గ్రామాల్లో సీసీరోడ్లు వేసి వదిలేశారు. వెంటనే తారురోడ్డు పనులు ప్రారంభించాలి. కంకర తేలిన రోడ్డుపై నడిచేందుకు ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

– బొల్లాడి మంజుల, సర్పంచ్, ఉప్పరమల్యాల,

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనే ధ్యేయం



పునఃప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, వాటిని బలోపేతం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. బుధవారం చిగురుమామిడి మండలంలోని సుందరగిరిలో మన ఊరు మనబడి పథకంలో మంజూరైన రూ.7 లక్షలతో ముస్తాబైన ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో నిలపడమే సీఎం కేసీఆర్ ధ్యేయమన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రతీ పాఠశాలలో కిచన్‌షెడ్, మరుగుదొడ్ల ఆధునీకరణ, కాంపౌండ్ వాల్ నిర్మాణం, ఫర్నీచర్, డైనింగ్‌హాల్ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త వినీత, జెడ్పీటీసీ గీకురు రవీందర్, ఎంపీడీఓ నర్సయ్య, ఎంపీఓ శ్రవణ్‌కుమార్, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకట్రమణారెడ్డి, హుస్నాబాద్ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్‌పర్సన్ ఆర్.రజిత, సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్, ఎంపీటీసీ మెడబోయిన తిరుపతి, ఉపసర్పంచ్ జంగ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం బి.సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, ఏఈ కె.కృష్ణమూర్తి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తాల్లపల్లి సంపత్, ఎస్‌ఎంసీ చైర్మన్ గైని చంద్రమౌళి గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు



రాగంపేట పాఠశాలలో మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్





హుజూరాబాద్‌లో ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, తిమ్మాపూర్‌లో జెడ్పీసీఈవో ప్రియాంక

చొప్పదండి: మన ఊరు మనబడి పథకంలో పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని రాగంపేటలో బుధవారం ఆయన మన ఊరు మన బడి పథకంలో ప్రాథమిక పాఠశాలలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించి మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఎంపీపీ చిలుక రవీందర్, జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, మార్కెట్‌కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరావు, సర్పంచ్ మామిడి లత, ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

తిమ్మాపూర్: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు ధీటుగా తీర్చిదిద్దుతున్నట్లు జెడ్పీసీఈవో ప్రియాంక అన్నారు. మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా పర్లపల్లిలో అభివృద్ధి చేసిన పాఠశాలను జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎంపీపీ కేతిరెడ్డి వనితతో కలిసి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మంజుల, సర్పంచ్ భారతి, ఎంపీటీసీ ముప్పిడి సంపత్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజేశ్, ఉపాధ్యాయులు మహిపాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు

హుజూరాబాద్: కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మనబస్తీ–మన బడి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జెడ్పీహెచ్ఎ స్ పాఠశాలను రూ. 23లక్షల నిధులతో, గణేశ్‌నగర్‌లో ప్రాథమిక పాఠశాలను రూ.15 లక్షల నిధులతో సకల సదుపాయాలు కల్పించి పాఠశాలలను ప్రారంభించి మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలలను దశలవారీగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. ఎంఈవో కేతిరి వెంకట నరసింహారెడ్డి, మున్సిపల్‌చైర్‌పర్సన్ గందె రాధిక, కమి షనర్ సమ్మయ్య, తహసీల్దార్ కోమల్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కోడిగుడ్లు పెట్టడం లేదా..?

- అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం
- మన ఊరు మన బడికి పథకంలో రూ. 27 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కోడిగుడ్లు పెట్టడం లేదా అంటూ మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెంజర్ల ప్రాథమిక పాఠశాల మనఊరు మన బడి పథకంలో ఎంపిక కాగా, పనులు పూర్తవడంతో బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రెండు జతల బట్టలు, పుస్తకాలు ఇచ్చారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారానికి మూడు కోడిగుడ్లు ఇస్తున్నారా లేదా అన్ని అడగడంతో విద్యార్థులు పెట్టడం లేదని వాపోయారు. దీంతో అక్కడే ఉన్న ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఉపాధ్యాయులపై మండిపడ్డారు. ఈ విషయంపై ఎమ్మెల్యే ఒకింతఅసహనం వ్యక్తం చేశారు. ఏమైనా సమస్యలుంటే తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నామని విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. విద్యార్థులు లేక మూతపడే స్థాయిలో ఉన్న పాఠశాలను మళ్లీ విద్యార్థులతో కళకళలాడేందుకు కృషిచేసిన బొల్లబత్తుల ఆంజనేయులును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ బోళ్ల వేణుగోపాల్, ఎంపీటీసీ గడ్డి రేణుక, ఉప సర్పంచ్ తాళ్లకుమార్, హెచ్‌ఎం రాజేశ్వరీ, ఎస్‌ఎంసీ చైర్మన్ బొల్లబత్తుల సదానందం, మాజీ సర్పంచ్ పడాల శంకరయ్య, నాయకులు గడ్డి గణేశ్, వివేక్, బూర్గుపల్లి సదానందం పాల్గొన్నారు.

శంకరపట్నం: ఆదరణకు నోచుకోని ప్రభుత్వ పాఠశాలల పునరుద్దరణకు మానకొండూర్ నియోజకవర్గంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో రూ.27 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే రసమయిబాలకిషన్ అన్నారు. మండలంలోని కేశవపట్నం జెడ్పీపాఠశాల ఆవరణలో నిర్మించిన డైనింగ్ హాల్‌ను బుధవారం ప్రారంభించారు. పాఠశాలలో ఓపెన్ జిమ్‌కు శంకుస్థాపన చేశారు. హెచ్‌ఎం మమతాగౌతమి, ఎంపీడీవో బషీరోద్దీన్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు అనిల్, కవిత, ఉపసర్పంచ్ హన్మంతు, రిటైర్డ్ ఎంఈవో రామస్వామి, ఉన్నారు.

లక్ష్మీగణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల గ్రామం శ్రీ లక్ష్మీగణపతి స్వామి పుష్కర వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ఎమ్మెల్యే పట్టువస్త్రాలు, పూలు, పండ్లు అందించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని ఆలయకమిటీ సభ్యులు సన్మానించి, తీర్థప్రసాదాలు అందించారు. అలాగే స్వామివారిని గ్రామవీధుల గుండా కమిటీ సభ్యులు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, ఆర్‌ఎస్‌ఎస్ మండల కోఆర్డినేటర్ బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచు తీగల మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ బోడ బలరాంరెడ్డి, డైరెక్టర్ గొల్లపల్లి రవి, నాయకులు న్యాత సుధాకర్, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాత్ముని విగ్రహానికి వినతి



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలో కేటీఆర్ బహిరంగ సభ సందర్భంగా కాంగ్రెస్ నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా గాంధీచౌక్‌లోని మహాత్మునికి యూత్ కాంగ్రెస్ నాయకులు సాయిని రవి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం వినతిపత్రం అందించి మాట్లాడారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని ఐదు మండలాలు, 2 మున్సిపాలిటీల్లోని సమస్యలు అభివృద్ధిపై మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రం ఇస్తామ ని కోరినా అధికారులు, కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్‌చేయడం అప్రజాస్వామికమన్నా రు. జమ్మికుంటలో అనేక సమస్యలు ఉన్నాయని, ప్రతిపక్ష పార్టీగా సమస్యలపై వివరిస్తామన్నా అధికారులు అడ్డుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి, ఎండీ.సజ్జు, ఎండీ. సలీం, ఇమ్రాన్, అయోధ్యగౌడ్, వినోద్, జంపయ్య, ప్రభుదాస్, శ్యామ్, రవీందర్, ఐలయ్య, ప్రణమ్, సమీర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు భూముల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ట్రెయినీ కలెక్టర్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో సామూహిక వ్యవసాయ పథకంలో ఆయిల్ పామ్ సాగుకు కరీంనగర్ ట్రెయినీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా డీడీ ఆర్టికల్చర్ అధికారి బండారి శ్రీనివాస్‌తో కలిసి బుధవారం వ్యవసాయ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 120 మంది దళితులు ప్రభుత్వం వారికి అందించిన 69 ఎకరాల భూమిలో ఆయిల్ పామ్ సాగుకు ఆర్టికల్చర్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలో బోర్లు, డ్రిప్ సౌకర్యాలు కల్పిస్తామని ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, కౌన్సిలర్ మారపల్లి భిక్షపతి హెచ్‌వో ఐలయ్య రైతులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలి



ఎల్లమ్మ చెరువును పరిశీలిస్తున్న మాజీ మంత్రి

గంగాధర: ఎల్లమ్మ చెరువు ముంపుతో నష్టపోయిన మంగపేట, నారాయణపూర్, ఇస్తార్‌పల్లి గ్రామాల ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య డిమాండ్ చేశారు. మండలంలోని ఎల్లమ్మ చెరువు ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో చెరువుకట్ట తెగిపోయినప్పటికీ దానికి మరమ్మతులు చేయకపోవడంతో రైతులకు తీవ్ర నష్ట కలుగుతోందని, మరమ్మతులు చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని కోరారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పంజాల ప్రశాంత్, రెండ్ల శ్రీనివాస్, మనోహర్, ప్రణయ్, ప్రేమ్, రాజు, రమేశ్, సాగర్ పాల్గొన్నారు.

ఈటలపై అసత్య ఆరోపణలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌రావు

జమ్మికుంట: ఉద్యమంలో చురుకైన నాయకుడిగా, ఉద్యమ నేతగా ఈటలకు టికెట్ కేటాయించారని కానీ ఈటలను కేసీఆర్ పరిచయం చేసి టికెట్ ఇచ్చారని, కేటీఆర్ అసత్య ఆరోపణలు చేయడం శోచనీయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని ఆయన నివాసంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర సాధనలో కీలకంగా పనిచేసిన ఉద్యమ నేత ఈటల రాజేందర్‌ను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదన్నారు. బీఆర్‌ఎస్ అబద్దాల అడ్డాగా మారిందన్నారు. ఉప ఎన్నికల్లో ఈటలను ఓడించేందుకు వందల కోట్లు ఖర్చుచేశారని, కులసంఘం, కమ్యూనిటీ భవనాలు హామీలు ఇచ్చిన ఈటల గెలుపును ఆపలేక పోయారన్నారు. ఉపఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసంచేశారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి ఎన్నోనిధులు ఇస్తున్న, పక్కదారి పట్టించి అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాడ గౌతమ్‌రెడ్డి, శ్రీలం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశం, సింగిరెడ్డి తిరుపతి, పల్లపు రవి, రాజ్‌కుమార్, తిరుపతిశ్రీను, మోతే స్వామి, ఇటుకాల స్వరూప, సమ్మయ్య, గణేశ్, రామ్, అమరేందర్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

జమ్మికుంట: మండలంలోని వెంకటేశ్వరపల్లి జీపీ పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అర్చకులు సముద్రాల ప్రసాదాచార్యులు ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు కీర్తి శేషులు కనుకమ్మ, పల్లె మొగిలయ్యగౌడ్ జ్ఞాపకార్థం పీఎంకే ఫౌండేషన్ నిర్వాహకులు పల్లె సుజాత, ప్రభాకర్‌గౌడ్ రూ.51,116 విరాళం అందించారు. కార్యక్రమంలో పల్లె తిరుమల రవిగౌడ్, కాంగ్రెస్ జిల్లా ఫిషర్‌మెన్ అధ్యక్షుడు పింగి రాకేష్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

లెదర్ పార్కు సందర్శన



సందర్శించిన యునైటెడ్ ఫ్రంట్ నాయకులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని లెదర్ పార్కును దళిత యూనైటెడ్ ఫ్రంట్ ఫౌండర్ అండ్ చైర్మన్, నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఇంటెలెక్చ్యుయల్ ఫోరం అధ్యక్షుడు అరెపల్లి రాజేందర్, స్థానిక అర్టిజన్స్‌లో కలిసి సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ లెదర్ పార్కు కోసం కేటాయించిన 25 ఎకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాలని అర్టిజన్స్‌కు పిలుపునిచ్చారు. లెదర్‌పార్కు సమస్యలపై ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు సమస్యలు వివరించామన్నారు. దళిత యునైటెడ్ ఫ్రంట్ నాయకులు బండ శ్రీనివాస్, అసంపల్లి నాగరాజు, మలుపు జిల్లా అధ్యక్షుడు మొలుగు రాజు, ఆర్టిజన్స్ రామంచ రాజారాం, మోతే స్వామి, చిట్యాల మొగిలి, రాజు, భూమన్న, కుమారస్వామి, వీరస్వామి పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

సైదాపూర్: మండలానికి పలు అభివృద్ధి పనులకు రూ.2.80 కోట్లు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు మండల సర్పంచులు కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయానికి రోడ్డు నిర్మించేందుకు రూ.50లక్షలు, మండలంలోని అన్ని గ్రామాలకు సీసీరోడ్ల నిర్మాణానికి రూ.2.30 కోట్లు నిధులు ఈజీఎస్‌లో మంజూరైనట్లు టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజయ్య, సర్పంచులు శ్రీనివాస్, రాములు తెలిపారు. మండల అభివృద్ధికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కృషిచేస్తున్నారని పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

సైదాపూర్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్‌లో నిర్వహించే శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.



పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామపరిధిలోని పర్కాల్ క్రాస్ సమీపంలోని అరుణోదయ గురుకుల పాఠశాలకు చెందిన 2001–02 బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయసమ్మేళనం బుధవారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులంతా ఒక చోటికి చేరి తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరికొకరూ యోగక్షేమాలను అడిగి తె లుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించారు. హెచ్‌ఎం సంతోషారావు, కరస్పాండెంట్ సత్యం, ఉపాధ్యాయ బృందం, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సీమంతాలు

రామడుగు: మండలంలోని కొక్కెరకుంట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్ సుధా అన్నారు.